


సేవలు హర్షణీయం

ఆలిండియా మార్వాడీ యువమంచ్ సభ్యుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



మామిడాకులకు వెళ్లి..

మామిడాకులు తెచ్చేందుకు వెళ్లిన వ్యక్తి వరి పొలం చుట్టూ వేసిన కరెంటు కంచెకు తగిలి మృత్యువాతపడ్డాడు. 8లో▸



న్యూస్‌రీల్

ఆదిబట్ల అభివృద్ధికి సహకరించండి

మంత్రిని కోరిన మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. మంగళవారం తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన నిరంజన్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మున్సిపల్ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్‌గౌడ్, కౌన్సిలర్ హరిదాసుగౌడ్, నాయకులు మర్రి రాంరెడ్డి, టీకుల కమలాకర్ రెడ్డి, జమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫరూక్‌నగర్ ఉగాది వేడుకల్లో గుజరాత్ కలెక్టర్

పండుగ సందర్భంగా స్వగ్రామానికి విచ్చేసిన సుష్మిత ఐఏఎస్



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గుజరాత్ కలెక్టర్ ఇప్పలపల్లి సుష్మిత తదితరులు

షాద్‌నగర్:ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో గుజరాత్ కలెక్టర్ ఇప్పలపల్లి సుష్మిత పాల్గొన్నారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వగ్రామానికి వచ్చిన ఆమె కుటుంబ సభ్యు లు, స్థానికులతో కలిసి పంచాంగ శ్రవణం చేశారు.

మానవత్వం గొప్పది

ఆమనగల్లు: మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డా.మల్లురవి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు మసీదుల్లో పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.



పరిగి: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో ఉగాది

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. క్రోధినామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. పంచాంగ పఠనం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని నాయకులు ఆకాంక్షించారు.




తాండూరు: భావిగి భద్రేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం, పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యేలకు సవాలే!

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ శాసనసభ్యులే

- గత అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీకి 75,888 మెజారిటీ
- అప్పుడు ప్రతిపక్ష పాత్రలో.. ఇప్పుడు అధికార హోదాలో..
- సీఎం, స్పీకర్ అదనపు బలం
- తాండూరులో గ్రూపు తగాదాలు
- పరిగి, వికారాబాద్ నేతల్లో అసంతృప్తి
- ప్రచారంలో ఇంకా వెనుకబాటే



వికారాబాద్: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్‌కు సవాల్‌గా మారాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష హోదాలో సత్తా చాటిన హస్తం పార్టీ.. ఇప్పుడు అధికార హోదాలో బల నిరూపణకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఎక్కువ రోజులు కూడా కాలేదు.. అధికార పార్టీకి చెందిన కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్‌గా ఉన్నారు. మిగిలిన రెండు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలిచారు. అయితే హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇటీవల ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో పర్యటించిన సమయంలోనూ ఇదే విషయాన్ని లేవనెత్తారు. జిల్లాలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోనే 40వేలకు పైగా మెజారిటీ వస్తుందని సీఎం రేవంత్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన రెండు సార్లు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇది కొంతవరకు ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

మెజార్టీ రెండింతలు అయితేనే..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 75,888 మెజార్టీ వచ్చింది. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి 32,720 మెజార్టీ రాగా పరిగిలో రామ్మోహన్‌రెడ్డికి 23,955, వికారాబాద్‌లో ప్రసాద్ కుమార్‌కు 12,672, తాండూరులో మనోహర్‌రెడ్డికి 6,538 మెజార్టీ వచ్చింది. ఇందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే కొడంగల్‌ను మినహాయిస్తే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి వచ్చే మూడు నియోజకవర్గాల్లో కలిపి 43,168 మెజార్టీ వచ్చింది. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రతిపక్ష పార్టీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇప్పుడు అధికార హోదాలో ఉండగా ఒకరు సీఎం, మరొకరు స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారి పట్టు నిలబడాలంటే చేవెళ్ల, మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలవాల్సిందే. గత ఎన్నికలతో పోలిస్తే రెండింతలు మెజార్టీ తెచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందనే భావన వ్యక్తమవుతోంది.

అసంతృప్తిని అధిగమిస్తేనే..

జిల్లాలో బీజేపీతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కొంత వెనకబడి ఉందని చెప్పవచ్చు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలి విడత ప్రచారం పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా క్షేత్రస్థాయికి వెళ్లలేదు.ఓ పక్క ఎన్నికలు సమీపిస్తుంటే తాండూరుతో సొంత పార్టీ నేతల మధ్య గ్రూపు తగాదాలు మొదలయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే సమక్షంలోనే పార్టీలోని కొత్త, పాత నాయకుల మధ్య మాటలు గొడవల వరకు వెళ్లాయి.ఇక పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ క్యాడర్‌లోఅసంతృప్తి కనిపిస్తోంది.అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా..ఒక్కరికి కూడా ఏ పదవులు రాకపోవటం..జిల్లాకు చెందిన వ్యక్తే సీఎంగా ఉండగా ఇంకేంటి అన్న భావన వ్యక్తమవుతుండటంతో ఇక తమకు పదవులు వస్తాయా.. రావా..? అనే మీ మాంసలోకి నాయకులు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే లు, నేతల్లో నెలకొన్న అసంతృప్తిని అధిగమించి.. వారిలో మళ్లీ నూతనోత్తేజం నింపితేనే ఈ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆ పార్టీ నేతలే అంటున్నారు.

18 నుంచి నామినేషన్ల పర్వం

- 25వ తేదీ వరకు స్వీకరణ ప్రక్రియ
- 'సువిధ'లో దరఖాస్తు చేసుకుంటే సభలు, సమావేశాలకు అనుమతులు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. ఇందు కోసం నామినేషన్ ఫారం -2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందొచ్చు. సెలవు రోజులు మినహా ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు గడువు ఉంది.

అభ్యర్థులకు సూచనలు

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదిస్తే సరిపోతుంది. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందినవారైన పక్షంలో తప్పనిసరి వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్‌ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- రిజిస్టర్డ్, గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్-3 లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేస్తూ వివరాలు పొందుపర్చాలి.
- అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయొచ్చు. సంబంధిత బ్యాంకు అకౌంట్ లావాదేవీల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుంది.
- అభ్యర్థులు ఏవైనా క్రిమినల్ కేసులుంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3 ఏలో వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాల్సి ఉంటుంది.
- గడిచిన పదేళ్లలో ఎవరైనా అభ్యర్థులు ప్రభుత్వ క్వార్టర్లలో ఉన్నట్లయితే, నీటి బిల్లులు, కరెంటు బిల్లులు వంటివి బకాయిలు లేవని నిరంభ్యంతర పత్రం జతపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీల వంటివి ముద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127 – ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు 48 గంటల ముందు 'సువిధ' పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి.



హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడు



గరుడవాహనంపై విష్ణుమూర్తి అవతారంలో శ్రీవారు

హనుమంత వాహనంపై శ్రీరాముడు

పట్టణంలో కొలువుదీరిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీరామచంద్రమూర్తి అవతారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం నుంచి జాతర స్థలం వరకు వాహన సేవ కొనసాగింది. దారిపొడవునా ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు అభిషేకం, వసంతోత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి 11 గంటలకు శ్రీవారు గరుడ వాహనంపై విష్ణుమూర్తి అవతారంలో విహరించారు. అర్ధరాత్రి ఒంటి గంటకు లంకాదహనం కన్నుల పండువగా జరిగింది. టపాసులు కాల్చి సందడి చేశారు.

– కొడంగల్

క్రోధినామ సంవత్సరంలో కోపతాపాలకు తావుండదు

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: క్రోధినామ సంవత్సరంలో కోపతాపాలకు తావుండదని, ప్రజల సహకారంతో తాండూరును అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని భద్రేశ్వర స్వామి ఆలయ కూడలిలో ఉగాది పండుగను పురస్కరించుకొని రథ చక్రాలకు పూజలు నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్షం రోజుల తర్వాత భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ జాతర జరుగుతుందని, ఉగాది రోజు రథ చక్రాలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జాతరను అట్టహాసంగా జరుపుకొందామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



రథ చక్రాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవర్చుకునే వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సంత్‌శ్రీ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ అని, సేవాలాల్ చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. స్వార్థం వీడి.. సేవా గుణం అలవర్చుకోవాలని కోరారు. భక్తిమార్గంతోనే ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ, అజయ్‌నాయక్, మిట్టునాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.4.19కోట్లు

లాభాల బాటలో తాండూరు వ్యవసాయ మార్కెట్

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉత్పత్తులు, పెరిగిన ఆదాయం



తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ లాభాల బాటలో పయనిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తక్కువగా వచ్చినా, మద్దతు ధర బాగుండటంతో ఆదాయం పెరిగింది. ఏడాది పాటు పంట ఉత్పత్తుల కొనుగోలులో తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మంచి గుర్తింపు ఉంది. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెటింగ్ శాఖ ఇచ్చిన లక్ష్యాన్ని దాటి రికార్డు సృష్టించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి మార్కెట్‌కు భారీగా పంట ఉత్పత్తులు తగ్గాయి. మద్దతు ధరకు మించి ధరలు పలకడంతో మార్కెట్‌కు ఫీజు రూపంలో ఆదాయం పెరిగింది.

రూ. 419 కోట్ల వ్యాపారం

తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో 80 శాతం మేర కమీషన్ ఏజెంట్ల ద్వారానే పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు. మార్కెట్‌లో ప్రతి రోజూ ఈ నామ్ ద్వారా బిడ్డింగ్ నిర్వహించి పంట ఉత్పత్తులకు ధర నిర్ణయిస్తారు. కంది, మొక్కజొన్న, వేరుశనగ పంటలు మార్కెట్‌కు వస్తాయి. పత్తిని జిన్నింగ్ మిల్లుల్లోనే నేరుగా కొనుగోలు చేస్తారు. అయితే 2023 -24 ఆర్థిక సంవత్సరంలో 6.02లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తుల కొనుగోలు చేయడం ద్వారా రూ. 419 కోట్ల వ్యాపారం జరిగింది. వన్ పర్సెంట్ కమీషన్ ద్వారా మార్కెట్ కమిటీకి రూ.4.19కోట్ల ఆదాయం సమకూరింది.

మూడేళ్ల తర్వాత..

2020–21 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ యార్డు లో 8.29లక్షల క్వింటాళ్ల ఉత్పత్తులను కొనుగోలు చేశారు. రూ.391.67 కోట్ల వ్యాపారం జరిగింది. ఫీజు రూపంలో మార్కెట్ కమిటీకి రూ.391 కోట్ల ఆదాయం వచ్చింది. 2021–22లో 5.86 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడులు కొనుగోలు చేయగా రూ.389 కోట్ల వ్యాపారం జరిగింది. మార్కెట్ ఫీజు రూపంలో రూ.389కోట్లు సమ కూరింది. 2022 – 23లో 8.60 లక్షల క్వింటాళ్ల కొనుగోలు చేయగా రూ.306.92కోట్ల వ్యా పారం జరిగింది. మార్కెట్ కమి టీకి రూ.3.06కోట్లు వచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 6.02లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తులు రాగా రూ.419కోట్ల వ్యాపారం, ఫీజు రూపంలో రూ. 4.19 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడు 2.57లక్షల క్వింటాళ్ల దిగుబడులు పడిపోయాయి.

2023-24 ఆర్థిక సంవత్సరంలో కొనుగోళ్లు ఇలా..

పంట	క్వింటాళ్లు	వ్యాపారం	మార్కెట్ ఫీజు
పత్తి	4,53,581	315,33,31,000	3,15,33,310
కందులు	74,858	65,75,670	65,75,670
పెసర	7,216	6,07,40,000	6,07,040
మినుములు	8,856	6,75,16,000	6,75,160
శనగలు	3,745	1,83,59,000	18,35,900
వేరుశనగ	3,745	1,83,59,000	1,83,590
మొక్కజొన్న	7,328	1,52.8,000	15,28,000
వరి ధాన్యం	21,813	4,59,70,000	4,59,700
సోయా	6,243	2,86,40,000	28,60,400

పత్తితో పెరిగిన ఆదాయం

రెండేళ్ల క్రితం వరకు పత్తి పంటకు సరైన మద్దతు ధర లభించలేదు. దీంతో మార్కెట్‌కు ఆదాయం రాలేదు. గత ఆర్థిక సంవత్సరంలో పత్తి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. మార్కెట్‌కు 70శాతం మేర పత్తి కొనుగోలు ద్వారానే ఆదాయం సమకూరింది. 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో తాండూరు మార్కెట్ కమిటీ ద్వారా 3,75 లక్షల క్వింటాళ్ల పత్తి పంట కొనుగోళ్లతో రూ.270,53కోట్ల వ్యాపారం జరిగింది. దీంతో మార్కెట్ కమిటీకి ఒక్క శాతం ఫీజు రూపంలో రూ.2.70 కోట్ల ఆదాయం వచ్చింది. 2022–23లో పత్తి పంట కొనుగోళ్లు సగానికి పడిపోయాయి. కేవలం 1.63లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. రూ.122,90కోట్ల వ్యాపారంతో మార్కెట్ ఫీజు రూ.1.22 కోట్లు సమకూరింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 4.53లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరిగాయి. దీంతో మార్కెట్ కమిటీకి ఫీజు రూపంలో రూ.3.15 కోట్ల ఆదాయం వచ్చింది.

లక్ష్యానికి మించి ఆదాయం



మార్కెటింగ్ శాఖ తాండూరు మార్కెట్ కమిటీకి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4 కోట్ల ఆదాయం రాబట్టాలని లక్ష్యం విధించింది. అయితే ఈ సారి పత్తి, కంది పంటల కొనుగోలు ద్వారా ఫీజు రూపంలో 4.19 కోట్ల ఆదాయం సమకూరింది. మిగతా పంటలతో పాటు చెక్‌పోస్టుల ద్వారా ఈ ఆదాయం వచ్చింది.

– రాజేశ్వరి,మార్కెట్ కమిటీ కార్యదర్శి, తాండూరు

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న బైక్‌

వ్యక్తి మృతి

పరిగి: ఉగాది రోజున నగరం నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల మండలం గౌరారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య(32) హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉగాది పర్వదినం సందర్భంగా రెండు రోజుల క్రితం భార్య, పిల్లలను పుట్టింటికి పంపించాడు. పండుగ రోజున మొగులయ్య బైక్‌పై ఇంటికి వస్తుండగా పరిగి పట్టణ కేంద్రంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


సురేష్‌ మృతదేహం

కొడంగల్‌: గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం చేగుంట గ్రామానికి చెందిన సురేష్‌(35) కర్నాటకలోని తన బంధువుల ఇంటికి వెళ్లి, మంగళవారం ఉదయం కొడంగల్‌ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడే టిఫిన్‌ చేసి, నీరు తాగాడు. బల్లపై కూర్చుని ఉండగా.. గుండెపోటు వచ్చి, అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

పండ్ల డబ్బులు అడిగినందుకు..

వ్యాపారిపై కత్తితో దాడి

వెంగళరావునగర్‌ : కొనుగోలు చేసిన పండ్లకు డబ్బులు అడిగినందుకు ఓ వ్యక్తి పండ్ల వ్యాపారిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్మికనగర్‌కు చెందిన మహ్మద్‌ అజార్‌ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం అబ్దుల్‌ నవీద్‌ అనే వృద్ధుడు అతడి వద్ద రూ.180 విలువైన పండ్లు కొనుగోలు చేసి డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పాడు. ఈనెల 8న నవీద్‌ కార్మికనగర్‌ లెహర్‌ కేఫ్‌ వద్ద ఉండగా అజార్‌ అతడిని డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో ఆగ్రహానికి లోనైన నవీద్‌ డబ్బులు ఇవ్వనని తేల్చిచెప్పడమే కాకుండా పక్కనే పండ్ల దుకాణంలో ఉన్న కత్తిని తీసుకువచ్చి అజార్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను ఆసుపత్రిలో చికిత్స అనంతరం మంగళవారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు

- మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం
- చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్‌: చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే.. కేంద్రం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కొమరబండ, కేసారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన యువత బీఆర్‌ఎస్‌ నాయకులు చల్లా ఇంద్రారెడ్డి, అంజిరెడ్డి, గంధం రమేశ్‌, ఉమ్మెంతల రమేశ్‌తో కలిసి కాషాయ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర సంక్షేమ పథకాల పట్ల ఇప్పుడిప్పుడే యువతకు అవగాహన ఏర్పడుతోందన్నారు. దేశం కోసం ధర్మం కోసం బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్‌పై ఎగిరేది బీజేపీ జెండాయేనని.. భారీ మెజార్టీతో గెలిపించేందుకు యువత కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌కు ఓటేసినా వచ్చే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. ఆరు గ్యారంటీల పేరిట అధికారం చేపట్టిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం కౌన్సిల్‌ మెంబర్‌ మాజీ ఎమ్మెల్యే కేఎస్‌.రత్నం, రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బూత్‌ అధ్యక్షుడు భవదేశ్‌, సీనియర్‌ నాయకులు నారాయణ, రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి

పాతాళానికి గంగమ్మ

- ఎండిన పంట పొలాలు
- దిగాలు చెందుతున్న అన్నదాతలు


నాన్‌ంధార్‌ఖాన్‌పేట్‌లో ఎండిన వరి పంట

షాబాద్‌: మండే ఎండలతో చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీరు అడుగంటింది. భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. బోరుబావులకు నీరందటం లేదు. తద్వారా సాగునీరు అందక నేలలు నెర్రలు వారగా.. పంటలు ఎండిపోయి, అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి. పంటలు కళ్లముందే ఎండిపోతున్నా.. ఏమీ చేయలేక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దిగుబడిపై ప్రభావం ఎలా ఉన్నా.. అసలుకే మోసం వచ్చేటట్లు ఉందని వాపోతున్నారు.

పదిశాతం ఆవిరి

షాబాద్‌ మండల పరిధి నాన్‌ంధార్‌ఖాన్‌పేట్‌, దామర్లపల్లి, షాబాద్‌, తాళ్లపల్లి, కక్కులూర్‌, సర్దార్‌నగర్‌, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, అంతారం, కుర్వగూడ తదితర గ్రామాల్లో సాగునీరు అందక, ఎర్రని ఎండలకు పంటలు మాడిపోతున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా దక్కేటట్లు లేవని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో వరి, 800 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా.. చివరి దశకు సాగు నీరందక సుమారు 10 శాతం పంటలు ఎండిపోయిన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

సాగు చేయాలంటే భయం



యాసంగిలో రెండు ఎకరాల్లో వరి పంట వేసిన. భూగర్భ జలాలు పడిపోవడంతో నీరందక బోరు ఆగుతూ పోస్తోంది. పొట్టదశలో ఉన్న వరి పొలానికి నీరులేక ఎండే పరిస్థితి వచ్చింది. ఎనిమిదేళ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదు. సాగు చేయాలంటే భయమేస్తోంది.

– గద్దం రాజు, రైతు, అంతిరెడ్డిగూడ

ఏం చేయాలో అర్థం కావడం లేదు



నాకు మూడెకరాల పొలం ఉంది. గతంలో ఎప్పుడూ ఎండిపోలేదు. బోరుబావి ఆధారంగా వరి సాగు చేస్తున్న. రెండు వారాల కిందట నీరు పోసే బోరు ఎండి పోయింది. ఇప్పుడు పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావటం లేదు. నీటి కోసం పొరుగు రైతుతో మాట్లాడుతున్న.

– అశిగారి బాల్‌రాజు, రైతు తాళ్లపల్లి


తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్‌, పొన్నాల లక్ష్మయ్య తదితరులు – సాక్షి, రంగారెడ్డి జిల్లా

మామిడాకులకు వెళ్లి.. అనంత లోకాలకు

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- పండుగ పూట గ్రామంలో విషాదం


పంట పొలంలో రాములు గౌడ్‌ మృతదేహం

పెద్దేముల్‌: మామిడాకులు తెచ్చేందుకు వెళ్లిన వ్యక్తి, వరి పొలం చుట్టూ వేసిన కరెంటు కంచెకు తగిలి మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన పెద్దేముల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గాజీపూర్‌కు చెందిన ఈడ్గి రాములు గౌడ్‌(63) తెల్లవారితే ఉగాది పండుగ ఉండటంతో సోమవారం సాయంత్రం 6గంటలకు తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పక్కనే ఉన్న మరో రైతుకు చెందిన మామిడి చెట్టుకు ఆకులు తెంపుకొని ఇంటికి వస్తున్న క్రమంలో.. పందుల నుంచి పంటకు రక్షణగా అమర్చిన కరెంటు కంచెను తగిలి మృత్యువాత పడ్డారు. రాత్రి అయినా రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు మృతుడి సోదరుడు లక్ష్మయ్యకు విషయం చెప్పారు. అన్నజాడ కోసం వెళ్లిన లక్ష్మయ్యకు పొలంలో రాములు విగతజీవిగా కనిపించాడు. విషయం కుటుంబీకులకు తెలపడంతో వారి రోదనలు మిన్నంటాయి. రాములు మృతితో పండుగ పూట గ్రామంలో విషాదం నెల కొంది. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌గౌడ్‌ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

పహాడీషరీఫ్‌: ఫుట్‌పాత్‌పై పడుకునే విషయంలో తలెత్తిన వివాదంలో ఓ నిండు ప్రాణం బలైపోయింది. ఈ సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన కామ్‌ సింగ్‌(40) జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నివసిస్తుంటాడు. సంజయ్‌ దయానంద్‌ కుకుడ్‌కార్‌ అనే వ్యక్తితో కలిసి క్యాటరింగ్‌ పనిచేస్తుంటాడు. కర్నాటకకు చెందిన మరోవ్యక్తి నవనాథ్‌(40) ఆటో డ్రైవర్‌. వీరిరువురు నిత్యం శ్రీరాం కాలనీ పోచమ్మ దేవాలయం పరిసరాల్లో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుంటారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి నిద్రించే ప్రదేశం విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయంలో ఆగ్రహించిన నవనాథ్‌.. కర్ర, రాయితో కామ్‌సింగ్‌ తలపై మోది హత్య చేశాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. వివరాలను సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘యువమంచ్‌’ సేవలు హర్షణీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌ రెడ్డి

ఎమ్మెల్యే మనోహర్‌ రెడ్డి

తాండూరు టౌన్‌: ఆలిండియా మార్వాడీ యువ మంచ్‌ సభ్యుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌ రెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని యువమంచ్‌ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన మినరల్‌ వాటర్‌ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మార్వాడీలు వ్యాపార రంగంలో రాణిస్తూ సామాజిక సేవా తత్పరతను కలిగి ఉండటం అభినందనీయమన్నారు. యువమంచ్‌ తాండూరు అధ్యక్షుడు అనిల్‌ సార్డా మాట్లాడుతూ ఏటా వేసవిలో బాటసారుల దాహం తీర్చేందుకు నాలుగు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. స్థానిక పర్శానీ కాంప్లెక్స్‌ వద్ద ఎమ్మెల్యే మనోహర్‌ రెడ్డి, ఎస్బీఐ వద్ద రాజస్థానీ ప్రగతి సమాజం అధ్యక్షుడు రమేష్‌ చంద్ర సార్డా, కోర్టు వద్ద బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అగ్గనూర్‌ శ్రీనివాస్‌, మల్లప్ప మడిగ వద్ద రాజస్థానీ నవయువ సంఘం అధ్యక్షుడు మన్మోహన్‌ సార్డా చలివేంద్రాలను ప్రారంభించారని పేర్కొన్నారు.

కులమతాలకు అతీతం..


ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న ఎంపీ తదితరులు

చేవెళ్ల: కులమతాలకు అతీతంగా జరుపుకొనే పండుగ రంజాన్‌ అని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్‌ కౌన్సిలర్‌ శ్రీనాథ్‌గౌడ్‌ ముస్లింలకు ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ఇందులో ఎంపీ రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింకు పండ్లు తినిపించి, ఉపవాస దీక్ష విరమింపచేశారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. ఎంపీగా తనను గెలిపిస్తే.. మీకు అందుబాటులో ఉండి, సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవటం మన ఆచారమని, దీనిని రాజకీయం చేసేందుకు వస్తున్న వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉదయ్‌ మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎజాస్‌, మజీద్‌కమిటీ చైర్మన్‌ జాకీర్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ వెంకటరామిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, మైసయ్య తదితరులు ఉన్నారు.

ఆనందం పంచేందుకు వచ్చేదే ఉగాది


షాద్‌నగర్‌: స్వామి వారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే శంకర్‌


కడ్తాల్‌: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: అందరి జీవితాల్లో ఉగాది ఉషస్సులు నింపాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఫరూఖ్‌నగర్‌ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజాకార్యక్రమంలో భాగంగా స్వామి వారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం చేపట్టిన పంచాగ శ్రవణ కార్యక్రమంలో మాట్లాడారు. జీవితంలో ఆనందోత్సవాలను పంచేందుకు వచ్చేదే ఉగాది అని, ఈ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిచారు. ఈ ఏడు ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, కొత్త ఆశలను చిగురింపజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, చెన్నయ్య, ఒగ్గుకిషోర్‌, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంచ రాములు, అప్పి, వెంకట్‌రావ్‌, సూర్యప్రకాష్‌, శ్రీను, అశోక్‌, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్‌: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వేదపండితుడు వెంకటేశ్వర శర్మ పంచాంగం చదివి వినిపించారు. అదే విధంగా మక్తమాధారం వేణుగోపాల స్వామి ఆలయంలో పండిత ప్రకర్ష వింజమూరి రామానుజన్‌ చార్యుల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం చేశారు. ఇందులో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సేవ్యానాయక్‌, విఠలయ్యగౌడ్‌, నాయకులు భాస్కర్‌రెడ్డి, బీచ్యానాయక్‌, నరేందర్‌రెడ్డి, జంగారెడ్డి, నర్సింహగౌడ్‌, శంకర్‌నాయక్‌, బాలరాజ్‌, చెన్నయ్య పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ సేవలో ఎంపీ


చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌తో ఎంపీ రంజిత్‌రెడ్డి, భీంభరత్‌ తదితరులు

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు

మొయినాబాద్‌: చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్‌ చేవెళ్ల పార్లమెంట్‌ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆయన సతీమణి, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతా రంజిత్‌రెడ్డి, కూతురు పూజా ఆకాంక్షరెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, కుమారుడు రాజ్‌ ఆర్యన్‌రెడ్డి తదితర కుటుంబ సభ్యుల సమేతంగా చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్‌ ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది పచ్చడి వలే జీవితంలో ఒడిదుడుకులు

ఉగాది పచ్చడిలోని షడ్రుచుల వలే ప్రతి ఒక్కరి జీవితంలో ఒడిదుడుకులు, సుఖదుఃఖాలు, కష్ట సుఖాలుంటాయని మంచిని ఆస్వాదించాలని.. చెడు ఉన్నప్పుడు తట్టుకోవాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్‌ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. చిలుకూరు బాలాజీని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పండుగలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో అందరూ బయటకు వచ్చి ఓటు వేయాలన్నారు. ఏ పార్టీకి ఓటు వేయాలనేది మీరే నిర్ణయించుకోండని.. ఓటు మాత్రం తప్పనిసరిగా వేయాలన్నారు. ఓటుతో మన బలం, బలగం ఏమిటో నిరూపించుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్‌, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


మండుతున్న ఎండలతో పక్షులు అల్లాడిపోతున్నాయి. ఆహ్లాదం, ఆహారం కోసం సుదీర్ఘ ప్రయాణం చేస్తున్నాయి. మంగళవారం ధారూరు మండల కేంద్రం కూడలి ప్రాంతంలో మురుగు జలాల్లోని పచ్చదనంపై కొంగలు ఇలా గుంపులుగా వాలిపోయాయి. ఆహారం కోసం పోటీపడుతూ సందడి చేస్తుండగా ఆ దృశ్యాన్ని ‘సాక్షి’ కెమెరా క్లిక్‌మనిపించింది. – ధారూరు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఉప్పల్‌: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్‌ పాశం సత్తయ్య కాలనికి చెందిన సత్య భాస్కర్‌ రెడ్డి(34) ప్రైవేట్‌ ఉద్యోగి. సోమవారం రాత్రి బైక్‌పై బయటికు వెళ్లి తిరిగి వస్తుండగా రామంతాపూర్‌ శివాజీ విగ్రహం వద్ద నిలిచి ఉన్న మరో బైక్‌ను ఢీ కొట్టి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటపా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్ట్రం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్‌ కాల్‌ సెంటర్‌!

- పోలీసులకు చిక్కకుండా సైబర్‌ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడ
- వాహనాల్లో తిరుగుతూ రోజుకో ప్రాంతంలో మోసాలు
- హైవేల పక్కన, నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌
- అక్కడినుంచే సామాన్యులకు ఫోన్లు చేసి మాయమాటలతో బురిడీ
- అందినకాడికి దండుకుని పరారీ
- పోలీసులకు సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు



సాక్షి, సిటీబ్యూరో: ‘‘బహుళ జాతి ఐటీ కంపెనీలో పనిచేస్తున్న జస్విత్‌ సైబర్‌ నేరస్తుల వలలో చిక్కి రూ.5 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడితో కేటుగాళ్లు సంప్రదింపులు జరిపిన పలు సెల్‌ఫోన్‌ నంబర్ల టవర్‌ లొకేషన్‌, సిగ్నళ్లను గుర్తించే ప్రయత్నం చేసిన పోలీసులు అవాక్కయ్యారు. రోజుకో ఫోన్‌ నంబరు నుంచి, గంట గంటకో టవర్‌ లొకేషన్‌ నుంచి ఫోన్లు చేసినట్లు గుర్తించి విస్తుపోయారు. లభించిన సాంకేతిక ఆధారాలతో టవర్‌ లొకేషన్‌ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు.. అదంతా నిర్మానుష్య ప్రాంతం కావడంతో షాకయ్యారు. స్థిరంగా ఒక చోట నుంచి కాల్‌ సెంటర్‌ ఏర్పాటు చేసి ఫోన్లు చేస్తే టవర్‌ లొకేషన్‌లో దొరికిపోతామని గ్రహించిన నేరస్తులు ఇలా మొబైల్‌ కాల్‌ సెంటర్‌తో బాధితులను మోసం చేస్తున్నట్లు తేల్చారు.’’

.. ఇలా సైబర్‌ నేరస్తులు మొబైల్‌ కాల్‌ సెంటర్లతో పోలీసులకు సవాల్‌ విసురుతున్నారు. సెల్‌ఫోన్‌ సిగ్నల్‌, టవర్‌ లొకేషన్‌, బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా పోలీసులు తమ ఉనికి, లావాదేవీలను పసిగడుతున్నారని గ్రహించిన సైబర్‌ కేటుగాళ్లు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. కాల్‌ సెంటర్ల ద్వారా మోసాలు చేస్తే ఏదోఒక రోజు పోలీసులకు చిక్కుతామని భావించిన కేటుగాళ్లు కొత్తగా మొబైల్‌ కాల్‌ సెంటర్లను తెరుస్తున్నారు.

కార్లతో తిరుగుతూ మోసాలు..

భౌతికంగా కాల్‌ సెంటర్లను ఏర్పాటు చేస్తే సాంకేతిక ఆధారంగా పోలీసులు వీటిని గుర్తిస్తారని గ్రహించిన నేరస్తులు సరికొత్త మార్గాన్ని అన్వేషించారు. పోలీసులకు సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తపడుతున్నారు. కారు, వ్యాన్‌ వంటి కదిలే వాహనాల్లో మొబైల్‌ కాల్‌ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారు మంది సైబర్‌ నేరస్తులు ముఠాగా ఏర్పడి, నాలుగైదు వాహనాల్లో సెల్‌ఫోన్లు, కస్టమర్ల డేటాతో తలోదిక్కున తిరుగుతున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో వాహనాలను నిలిపి, అమాయకులకు ఫోన్లు చేసి కస్టమర్‌ కేర్‌, ఓఎల్‌ఎక్స్‌, ఇన్వెస్ట్‌మెంట్‌ ఫ్రాడ్స్‌ పలు రకాలుగా బురిడీ కొట్టిస్తూ అందినంత డబ్బులు దండుకున్న తర్వాత సాయంత్రానికి ఫోన్లు స్విచ్ఛాఫ్‌ చేస్తున్నారు.

మూడు కమిషనరేట్లలో సైబర్‌ నేరాలు

కమిషనరేట్‌	2021	2022	2023
హైదరాబాద్‌	2,066	4,471	4,332
రాచకొండ	1,360	2,049	2,562
సైబరాబాద్‌	3,854	4,850	5,342

అవన్నీ రోడ్లు, నిర్మానుష్య ప్రాంతాలే..

బాధితుల నుంచి వివరాలు సేకరించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సేకరించి ఎట్టకేలకు సైబర్‌ నేరగాళ్లు నడుపుతున్న నకిలీ కాల్‌ సెంటర్లను గుర్తించి, పక్కా పథకం ప్రకారం వాటిపై దాడి చేసి నేరస్తులను పట్టుకునేవారు. దీంతో సైబర్‌ నేరస్తులు మొబైల్‌ కాల్‌ సెంటర్లను తెరలేపినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. వాహనాల్లో కూర్చొని రోజుకో ప్రాంతంలో తిరుగుతూ సైబర్‌ మోసాలకు పాల్పడుతున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులకు టెక్నికల్‌ ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒక్కో రోజు ఒక్కో చోటి నుంచి నేరాలు చేసినట్లు సెల్‌ఫోన్‌ సిగ్నల్స్‌, లొకేషన్స్‌ వస్తుంటాయి. అక్కడికి వెళ్లి చూస్తే అదంతా హైవే రోడ్డు మార్గం, నిర్మానుష్య ప్రాంతం ఉంటున్నాయి. దీంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

భాషను బట్టి టెలీకాలర్ల నియామకం..

గతంలో ఢిల్లీ, గుర్గావ్‌, ఉత్తర్‌ప్రదేశ్‌, కోల్‌కత్తా వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో సైబర్‌ నేరగాళ్లు ఎక్కువగా నకిలీ కాల్‌ సెంటర్లను ఏర్పాటు చేసి, సైబర్‌ నేరాలకు పాల్పడేవారు. ఒక్కో కాల్‌ సెంటర్‌లో వందల సంఖ్యలో టెలీ కాలర్లను నియమించుకునేవారు. ప్రాంతం, భాషను బట్టి టెలీ కాలర్లకు ఆయా రాష్ట్రాల కస్టమర్ల డేటాను అందించేవారు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల ప్రజలను మోసం చేసేందుకు తెలుగు భాషపై పట్టున్న టెలీకాలర్లనే నియమించుకునేవారు. డార్క్‌నెట్‌, జాబ్‌ పోర్టల్స్‌, సోషల్‌ మీడియా ఇలా వివిధ మార్గాల ద్వారా కస్టమర్ల పేరు, ఫోన్‌ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేవారు. గిఫ్టులు, పార్ట్‌ టైం జాబ్స్‌, పెట్టుబడులు ఇలా రకరకాల పేర్లతో మోసాలకు పాల్పడేవారు.